సాక్షి
నల్లగొండ
బుధవారం : 18 : సెప్టెంబర్ : 2024



పది రోజులు ఆగాల్సిందే!

ఎడమకాల్వకు పడిన గండ్లను పూడ్చి కాల్వకు నీటిని విడుదల చేయాలంటే మరో పది రోజులు పట్టనుంది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 70,681 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 24,884 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,704 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,080 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 4,613 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	644. అడుగులు
ఇన్‌ఫ్లో	: 382.28 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 691.30 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 315.73 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 315.73 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

దూర విద్య ప్రవేశాలకు దరఖాస్తులు

నల్లగొండ రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలోని డిగ్రీలో అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సమానమైన విద్యార్హత ఉన్న వారు డిగ్రీలో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరాల కోసం 9553568049, 7382929758 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నల్లగొండ-భువనగిరి మధ్య సెమీడీలక్స్ బస్సు

నల్లగొండ రూరల్ : నల్లగొండ డిపోకు కేటాయించిన సెమీ డీలక్స్ బస్‌ను నల్లగొండ-భువనగిరి మధ్య నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ నుంచి చిట్యాల, వలిగొండ మీదుగా భువనగిరికి సెమీ డీలక్స్ బస్‌ను నడుపుతామని.. భువనగిరికి ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.100 ఉండగా, సెమీడీలక్స్‌కు రూ.110 ఉంటుందని.. ఈ బస్సులో మహాలక్ష్మి పథకం వర్తించదని పేర్కొన్నారు.

సాయుధ పోరాటంతోనే నిజాం లొంగుబాటు

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



గురునాథ్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మునుగోడు : భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతోనే ఆనాటి నిజాం నవాబ్ లొంగిపోయాడని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలోని పోరాట యోధులైనా కొండవీటి బుచ్చిరెడ్డి, గురునాథ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దులు, సత్తిరెడ్డి, మల్ల రాములు దంపతుల విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపించింది కమ్యూనిస్టు పార్టీని గుర్తుచేశారు. నేడు బీజేపీ తెలంగాణ విమోజన దినంగా ప్రకటించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, సునీల్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, రామచంద్రం, టి.వెంకటేశ్వర్లు, ఎస్.రామలింగయ్య, నర్సింహ, శ్రీను పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ, కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వేములపల్లి : ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సాయుధ పోరాట దినోత్సవం సందర్భంగా మంగళవారం వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామంలో ఆనాడు ప్రాణాలర్పించిన వీరుల స్థూపాల వద్ద ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను సన్మానించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో రావులపెంట కేంద్రంగా ఎంతో మంది వీరులు నిజాం నవాబుకు ఎదురొడ్డి ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. ఆనాడు హిందూ, ముస్లింలు ఐక్యంగా పోరాడారన్నారు. కానీ నేడు బీజేపీ ఓట్ల కోసం సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా వక్రీకరిస్తోందని మండిపడ్డారు. సాయుధ పోరాట సమయంలో కాంగ్రెస్ పార్టీ నిజాం నవాబుకు మద్దతు పలికిందని, లొంగుబాటు తరువాత సలహాదారుడికి పెద్ద పదవి అప్పగించి రిజ్వీని క్షేమంగా పాకిస్తాన్‌కు తరలించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, జగదీశ్చంద్ర, ఎస్‌కె.ఆయూబ్, పోలెబోయిన వరలక్ష్మి, రెమడాల పరుశురాములు, గాదె పద్మమ్మ, శీలం చిన్నసైదులు, నాగిరెడ్డి, రెమడాల భిక్షం, చింతకుంట్ల రాములు, నామ సోమయ్య, ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.



సాయుధ పోరులో నల్లగొండ కీలకం

- రాష్ట్ర చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం
- నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించింది
- జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలి
- తెలంగాణ ప్రజాపాలన వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి
- అలంరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా భీంరెడ్డి నర్సింహారెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, సుద్దాల హనుమంతు, బొందుగుల నారాయణరెడ్డి వంటి ఎందరో త్యాగధనులు ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపారు. అమరుల త్యాగ ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన అందిస్తున్నాం.

– రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : అమరుల త్యాగ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం అవతరించిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17న మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 ఒక కీలకమైన రోజు, నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలు విముక్తి పొందారు. నిజాం నిరంకుశ పాలనలో భూస్వామ్య, జాగీర్దారీ విధానం, వెట్టిచాకిరి, రజాకారుల దాష్టికానికి వ్యతిరేకంగా.. ప్రజలంతా ఏకమై ఉద్యమించారు. బండి యాదగిరి రాసిన 'బండి వెనక బండి కట్టి' పాట తెలంగాణ సాయుధ పోరాటం ఉవ్వెత్తున ఎగిసి పడడానికి కారణమైంది. ఈ పోరాటంలో గుండ్రాంపల్లి, కడివెండి, రావులపెంట, ఏనెమిదిగూడెం ప్రాంతాలు కేంద్ర బింధువుగా నిలిచాయి. హైదరాబాద్ రాష్ట్రంలో ప్రజలపై రజాకారులు, జమీందార్ల దాడులు పెరిగాయని గ్రహించిన అప్పటి ప్రధాని నెహ్రూ.. హోంమంత్రి వల్లబాయ్ పటేల్ ఆధ్వర్యంలో సైన్యాన్ని రంగంలోకి దింపడంతో.. 1948, సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేస్తున్నట్లు నిజాం ప్రకటించారు. అందుకే నేడు ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

అన్ని వర్గాలకు గౌరవం కల్పిస్తున్నాం

మా ప్రభుత్వం అన్ని వర్గాలకు గౌరవం కల్పించే విధంగా ముందుకు సాగుతోంది. హైదరాబాద్‌లోని కోఠి మహిళా విశ్వ విద్యాలయానికి ఐలమ్మ పేరు, హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థకు కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు పెట్టాం. ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తున్నాం. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు, రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రుణమాఫీ చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయాం. ప్రజా గాయకుడు గద్దర్ పేర సినీ అవార్డులు ఇస్తున్నాం. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నాం. సర్వాయి పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నాం. పారిస్ పారా ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తెలంగాణ బిడ్డ జీవన్‌జీ దీప్తికి కోటి రూపాయల పారితోషికం ఇవ్వడమే గాక 500 గజాల ఇంటి స్థలం ఇచ్చి గౌరవించామని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, దేవరకొండ, నకిరేకల్ ఎమ్మెల్యేలు బాలునాయక్, వీరేశం, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, ఏఎస్పీ రాములునాయక్, డీఆర్‌ఓ రాజ్యాలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీఓ రవి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన కలెక్టర్, ఎస్పీ

వారంలో ఒక రోజు ప్రజాదర్బార్..

ప్రజల కష్టాలు తీర్చేందుకు జిల్లా కేంద్రంలో స్వయంగా వారంలో ఒక రోజు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నా. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణం కోసం అమెరికా వెళ్లి టన్నెల్ బోరింగ్ మరమ్మతుకు చర్యలు తీసుకున్నా. త్వరలో ఎస్ఎల్‌బీసీని ఉప ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులతో పరిశీలిస్తాం. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును త్వరగా పూర్తి చేస్తాం. జిల్లాలో వైద్య కళాశాలతో పాటు నర్సింగ్ కళాశాల, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మించుకుంటున్నాం. 241.90 కిలోమీటర్లు విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి విస్తరణ పనులు, రోడ్లు, బ్రిడ్జిలు, భవనాల మరమ్మతుకు ఈ ఏడాది రూ.512.81 కోట్లు మంజూరు చేశాం. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రజలంతా సహకరించాలి.



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి



గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రజలకు అవసరమైనవి ఇచ్చేదే ప్రజాపాలన

- కలెక్టర్ నారాయణరెడ్డి



కలెక్టరేట్‌లో జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్

నల్లగొండ : ప్రజలకు అవసరమైన వాటిని అందించేదే.. ప్రజాపాలన అని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక జెడ్పీ కార్యాలయంలో, కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1948 సెప్టెంబరు 17న తెలంగాణ ప్రాంతం రాజరికపాలన నుంచి భారత యూనియన్‌లో కలిసిందన్నారు. అప్పటి నుంచి రాజరిక పాలన పోయి ప్రజాపాలన ప్రారంభమైందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా అధికారులు ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, స్పెసల్ కలెక్టర్ నటరాజన్, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం



తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మీనగేష్, తలారి బలరాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, నాయకులు పల్లే విజయ్, రాచకొండ వెంకన్నగౌడ్, చాగోని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పనులు పూర్తిచేయాలి

- సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని.. నెల రోజుల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుమలగిరిలోని కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లుగా నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం పూర్తికాకపోవడంతో అద్దె భవనంలో సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వర్షం వచ్చినప్పుడు ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో చదివిస్తూ వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలించిన డీఈఓతో ఫోన్‌లో మాట్లాడారు. నెలరోజుల్లో పనులు పూర్తి చేయాలని తాను మరోమారు భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంసాని చంద్రశేఖర్, నాయకులు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డి, నాసర్‌రెడ్డి, కృష్ణ, లాలు, ఎంఈఓ రాము, ఎంఎన్ఓ శ్రీనివాస్, ఎస్ఓ కవిత తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రతిపాదనలు పంపాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ప్రతిపాదనలు సమర్పించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో వానాకాలం ధాన్యం కనీస మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 400 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ, ఎఫ్‌సీఐ, వ్యవసాయ శాఖలు రానున్న మూడు రోజుల్లో ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు, తూకం కొలిచే యంత్రాలను సిద్ధంగా ఉంచాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. గ్రామాల వారీగా కొనుగోలు కేంద్రాలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం కస్టం మిల్లింగ్ రైస్‌పై సమీక్షిస్తూ.. సెప్టెంబర్ చివరి నాటికి సీఎంఆర్ పూర్తిచేయాలన్నారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల డీఎం హరీష్, వ్యవసాయాధికారి శ్రవణ్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు : డీఎంహెచ్‌ఓ

త్రిపురారం : సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించి వీలైనంత త్వరగా పనుల పూర్తి చేయాలన్నారు. సాధారణ జ్వరాలపై ప్రజలు భయాందోళనకు గురికాకుండా తగిన సమయంలో పరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. ఎక్కడా మందుల కొరత లేదని ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రఫి, డాక్టర్ శంకర్‌నాయక్, డీటీసీఓ కళ్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీతావాణి, రమేష్, రజిని, సోమయ్య, జలీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

70 ఏళ్లు పైబడితే ఆరోగ్య బీమా

- వృద్ధుల వైద్యసేవలకు కేంద్రం కొత్త పథకం
- ఏడాదికి రూ.5 లక్షల బీమా
- ఆదాయంతో సంబంధం లేకుండా వర్తింపు
- త్వరలోనే అందనున్న హెల్త్‌కార్డులు
- జిల్లాలో 83,168 మందికి మేలు



గత పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం వృద్ధుల వివరాలు

70 నుంచి 75 ఏళ్లు పైబడినవారు	65,781
80 ఏళ్లు పైబడినవారు	17,382

నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం వృద్ధుల ఆరోగ్యంపై మరింత దృష్టి సారించింది. ఇందులో భాగంగా కేంద్రం 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆదాయంతో సంబంధం లేకుండా ఆరోగ్య బీమా కల్పిస్తామని ప్రకటించింది. దీంతో సంవత్సరానికి రూ.5 లక్షల వరకు బీమా వృద్ధులకు అందనుంది. దీంతో డెబ్బై ఐదేళ్లు పైబడిన వృద్ధుల్లో ఆనందం నెలకొంది. ఫలితంగా జిల్లాలో 70 ఏళ్లు పైబడిన 83,160 మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరనుంది.

ఆదాయంతో సంబంధం లేకుండా..

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి ఆయుష్మాన్ భారత్ పేరుతో ఉద్యోగులకు కూడా హెల్త్ స్కీమ్‌లు అమలు చేస్తోంది. అయితే తెల్లరేషన్ కార్డులు ఉన్నవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. అంతా ఆన్‌లైన్‌లో కార్డులు పొందినప్పటికీ ఏ ఆస్పత్రుల్లోనైనా వైద్యసేవలు పొందవచ్చు. అయితే ఈ పథకంపై ప్రభుత్వం అవగాహన కల్పించకపోవడంతో రేషన్ కార్డుకు లింకు పెట్టడంతో జనం పెద్దగా వినియోగించుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం కిందే ప్రజలు ఎక్కువగా వైద్యం చేయించుకుంటున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఆదాయంతోపాటు రేషన్, ఆధార్ కార్డులతో సంబంధం లేకుండా 70ఏళ్లు పైబడిన వృద్ధులకు ఏడాదికి రూ.5లక్షల ఆరోగ్య బీమాను అమలు చేయాలని నిర్ణయించింది. త్వరలో హెల్త్ కార్డులు ఇస్తామని చెప్పింది. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వారందరికీ ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చు.

హెల్త్‌కార్డు ఉంటే వర్తింపు..

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు హెల్త్ కార్డులు కలిగి ఉంటే కేంద్రం అమలు చేస్తున్న ఈ ఆయుష్మాన్ భారత్ పథకంలో 70 ఏళ్లు పైబడిన వారికి ఇందులో ఏ స్కీమ్ అనుకూలంగా ఉంటే ఆ స్కీమ్‌లో వైద్యసేవలు అందిస్తారు. అయితే ఈ పథకం కింద ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ వైద్యసేవలు పొందే వీలుంది.

వృద్ధులకు ఎంతో మేలు



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త పథకం అమలైతే వృద్ధులకు ఎంతో మేలు జరగనుంది. చాలామంది వృద్ధులు వృద్ధాప్యంలో షుగర్, బీపీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. అలాంటి వారికి వైద్యం చేయించాలంటే చాలా ఖర్చుతో కూడిన పని. కాబట్టి ఈ పథకం అమలైతే వృద్ధుల కుటుంబ సభ్యులకు వైద్యసేవల విషయంలో ఆర్థికంగా ఎదురయ్యే బాధలు తీరుతాయి.

– ఓంకారం, నల్లగొండ

ప్రతి ఆస్పత్రిలో వైద్యం అందించాలి



కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఇంతకు ముందు ఏ ఆసుపత్రిలో కూడా వైద్యం అందించడం లేదు. ఆరోగ్యశ్రీ కిందనే అక్కడక్కడా వైద్య సేవలు అందుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ కింద ప్రతి ప్రైవేట్ ఆస్పత్రిలో కచ్చితంగా వైద్యం చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకపోతే పథకం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. అలాగే కొత్తగా తెచ్చిన పథకంపై కూడా ప్రచారం చేయాలి.

– చంద్రశేఖర్, నల్లగొండ

క్లుప్తంగా

ఆటో, డీసీఎం ఢీ.. ఇద్దరికి గాయాలు


ఘటనా స్థలంలో ఆటో, డీసీఎం

ఆలేరురూరల్: ఆలేరు పట్టణంలోని మసీదు వద్ద మంగళవారం ఆటో, డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన బింగి శ్రీను మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని మేడిపల్లి నుంచి ఆటోలో టైల్స్, పెయింటింగ్ డబ్బాలు తీసుకుని ఆలేరుకు వస్తున్నాడు. అదే సమయంలో గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న హైదరాబాద్‌కు వెళ్తున్న డీసీఎం ఆలేరు పట్టణంలోని మసీదు వద్ద ఆటోను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బింగి శ్రీను తలకు తీవ్రగాయాలు కాగా, డీసీఎం డ్రైవర్ వంగాల భాస్కర్ కాలు ఫ్యాక్చర్ అయ్యింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీనుని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

మహిళలపై దాడి.. ముగ్గురిపై కేసు నమోదు

మేళ్లచెరువు: మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వారిపై దాడికి పాల్పడిన ముగ్గురిపై మేళ్లచెరువు పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు గ్రామానికి చెందిన పలువురు మహిళలు తమ ఇళ్ల ముందు పనిచేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన సాతులూరు సురేష్ వారి ఫొటోలు తీశాడు. ఇది గమనించిన మహిళలు ఫొటోలు ఎందుకు తీస్తున్నావని సురేష్‌ను అడుగగా.. అతడు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా తన కుటుంబ సభ్యులతో కలిసి వారిపై దాడికి పాల్పడ్డారు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు సురేష్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించినట్లు ఎస్‌ఐ తెలిపారు. సురేష్‌పై గతంలో పలు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సురేష్‌తో పాటు అతడి తండ్రి మాధవరావు, తల్లి లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగను చితకబాదారు.. పులిహోర తినిపించారు

నార్కట్‌పల్లి : చోరీకి వచ్చిన దొంగను గ్రామస్తులు పట్టుకుని చితకబాదారు. అతడు ఆకలిగా ఉందని చెప్పడంతో వినాయక విగ్రహం వద్ద ఉన్న పులిహోర తెచ్చి అతడి ఆకలితీర్చారు. నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోగుల గణేష్ అనే యువకుడు సోమవారం అర్ధరాత్రి ఆ గ్రామంలోని రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు. ఆ తర్వాత హనుమాన్ ఆలయంలోకి ప్రవేశించి తాళం పగులకొడుతుండగా శబ్దం రావడంతో.. అదే సమయంలో వినాయకుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న కొంతమంది యువకులు గమనించారు. ఆ దొంగను పట్టుకొని విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదారు. దొంగతనానికి వచ్చిన గణేష్ తనకు ఆకలి వేస్తుందని చెప్పడంతో యువకులు వినాయక శోభయాత్రలో భాగంగా వెంట ఉన్న పులిహోరను తినిపించారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో నార్కట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పోగుల గణేష్ కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష కూడా అనుభవించాడని పోలీసులు తెలిపారు.

ఆవు దూడల పట్టివేత

హుజూర్‌నగర్: అక్రమంగా తరలిస్తున్న ఆవు దూడలను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని మార్కెట్ యార్డు ప్రాంతం నుంచి కోడె దూడలు, ఆవు దూడలను కోదాడకు టాటా ఏస్ వాహనంలో తరలిస్తుండగా.. భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు ఆపారు. ఇంతలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అక్కడికి చేరుకుని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి ఎస్‌కే ఆరిఫ్, సోహెల్, అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆవుదూడలను హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరో పది రోజులు ఆగాల్సిందే!

- సాగర్ ఎడమ కాల్వ గండ్లకు కొనసాగుతున్న మరమ్మతులు
- ఎండిపోతున్న వరిపొలాలు
- ఆందోళనలో అన్నదాతలు
- మూడురోజుల్లోనే పూర్తికావొచ్చిన ముక్త్యాల మేజర్ గండి పూడ్చివేత


కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్టకు కొనసాగుతున్న మరమ్మతులు

కోదాడ: సాగర్ ఎడమ కాల్వకు కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం, చిలుకూరు, కోదాడ మండలాల పరిధిలో పడిన మూడు గండ్లను పూడ్చివేసే పనులను అధికారులు చేపట్టారు. అంచనాలు, టెండర్లు అంటూ కాలం గడిపిన అధికారులు గండ్లు పడిన 15 రోజుల తర్వాత మొదలుపెట్టిన మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. క్షేత్రస్థాయి పరిశీలనను బట్టి చూస్తే నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద పాలేరు సమీపంలో పడిన ఎడమ కాల్వ గండి పూడ్చడానికి మరో వారం, పది రోజులు పట్టే అవకాశం ఉంది. రెడ్లకుంట మేజర్ పనులు కూడా వారం, పది రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు అధికారులు, రైతులు అంటున్నారు. ముక్త్యాల మేజర్‌కు పడిన గండి పనులు రెండు రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉందని అక్కడి రైతులు అంటున్నారు. మరో వారం, పది రోజుల వరకు సాగర్ ఎడమ కాల్వకు నీరు ఇచ్చే పరిస్థితి కానరావడం లేదు. గడిచిన వారం రోజులుగా విపరీతంగా ఎండలు కొడుతుండడంతో ఇప్పటికే వేల ఎకరాల్లో వరిపొలాలు ఎండిపోతున్నాయి. దీంతో వేల రూపాయలు పంట పెట్టుబడి పెట్టిన అన్నదాతల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

15 రోజులు ఆగారు.. మూడు రోజుల్లో పూర్తిచేశారు..

ఈ నెల 1వ తేదీ రాత్రి సాగర్ ఎడమ కాల్వకు మూడు చోట్ల గండ్లు పడ్డాయి. వీటిలో చిలుకూరు వద్ద ముక్త్యాల మేజర్ గండి కూడా ఉంది. ముక్త్యాల మేజర్ డిస్చార్జి కెపాసిటీ 1300 క్యూసెక్కులు కాగా ఎప్పుడు వెయ్యి క్యూసెక్కులకు మించి నీరు విడుదల చేయరు. దీనిలో రెడ్లకుంట మేజర్‌కు రెండు వందల క్యూసెక్కులు విడుదల చేయగా, ప్రస్తుతం గండి పడిన ప్రదేశంలో ముక్త్యాల మేజర్‌లో నీటి ప్రవాహం 800 నుంచి 900 క్యూసెక్కులు ఉంటుంది. అంటే ఇక్కడ పెద్దగా నీటి ప్రవాహం ఉండదు. ఇక్కడ పడిన గండిని పూడ్చడానికి కూడా అధికారులు 15 రోజులు ఆగారు. ఆదివారం మొదలుపెట్టిన పనులు మంగళవారం సాయంత్రానికే దాదాపు పూర్తికావొచ్చాయి. ఈ పనులు ఈ నెల 2, 3 తేదీల్లో చేపట్టి వెంటనే పూర్తిచేస్తే మునగాల హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటిని పాలేరు వైపు పోకుండా నిలిపివేసి, రెడ్లకుంట మేజర్‌కు షట్టర్ దించి ముక్త్యాల మేజర్‌కు నీరు ఇచ్చే అవకాశం ఉండేది. కింద ఉన్న ముక్త్యాల మేజర్‌కు నీరు ఇస్తే పైన ఉన్న నేరేడుచర్ల, గరిడేపల్లి, చిలుకూరు, మునగాల మండలాలకు సాగునీరు వచ్చేది. హుజూర్‌నగర్, మేళ్లచెరువు, మట్టపల్లి మండలాల్లో వేల ఎకరాలకు నీరు అందడంతో పాటు అన్నదాతలకు ఏమాత్రం నష్టం జరిగి ఉండేది కాదు. మునగాల హెడ్ రెగ్యులేటర్ వద్ద పాలేరు వైపు నీరు ఆపడంతో కేవలం నడిగూడెం మండలం ఒక్కదాని మీదే ప్రభావం ఉండేది. ఈ విషయంలో నీటి పారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యం అన్నదాతలను తీవ్ర నష్టానికి గురి చేసింది.


రెడ్లకుంట మేజర్‌కు జరుగుతున్న మరమ్మతులు


రెడ్లకుంట మేజర్ కింద ఎండిపోతున్న వరిపొలాలు

నీళ్లున్నా.. పొలాలు ఎండిపోతున్నాయి

మునుపెన్నడూ లేని విధంగా గడిచిన రెండు నెలలుగా సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని వృథాగా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మరో పక్క సాగర్ ఆయకట్టు పరిధిలోని 30వేల ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతు పనులు మరో వారం నుంచి పది రోజులు పడతాయని, ఎండలు ఇలాగే ఉంటే పంటలపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు వాపోతున్నారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టిన తర్వాత ఇలాంటి పరిస్థితి దాపురించడంతో కౌలు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌లో నీరు లేకపోతే బాధపడేవారం కాదని.. అక్కడ నీరు నిండుగా ఉండి కూడా ఇక్కడ పొలాలు ఎండిపోవడమే తమకు తీవ్రబాధను కలిగిస్తోందని ఎడమ కాల్వ పరిధిలోని అన్నదాతలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

నడిగూడెం: మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం సమీపంలో సాగర్ ఎడమ కాల్వ గండి మరమ్మతు పనులను నీటిపారుదల శాఖ ఎస్‌ఈ శివధర్మతేజ మంగళవారం పరిశీలించారు. మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరమ్మతు పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈఈ రామకిషోర్, డీఈ రఘు, ఏఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు. అదే విధంగా గండి మరమ్మతు పనులను కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. ఆయన వెంట నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు. కాగితరామచంద్రాపురం సహకార సంఘం చైర్మన్ గోసుల రాజేష్, మాజీ సర్పంచ్‌లు మంచికంటి వెంకటరెడ్డి, నాగిరెడ్డి లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ బందారపు మల్లికార్జున్ తదితరులు కూడా మరమ్మతు పనులను పరిశీలించారు.

పటేల్ చొరవతోనే భారత్‌లో విలీనం

- భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్


వల్లభాయ్‌పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ చామల, మాజీ ఎంపీ వీహెచ్, ఎమ్మెల్యేలు సామేల్, వేముల వీరేశం

శాలిగౌరారం: సర్దార్ వల్లభాయ్‌పటేల్ చొరవతోనే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ వి. హన్మంతరావు అన్నారు. మంగళవారం వారు శాలిగౌరారం మండలంలో తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశంతో కలిసి పర్యటించారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వల్లభాయిపటేల్ స్వచ్ఛమైన కాంగ్రెస్‌వాది అన్నారు. హైదరాబాద్ సంస్థానం విలీనానికి బీజేపీకి ఎటువంటి సంబంధం లేదని, ఆ సమయంలో అసలు దేశంలో బీజేపీ పుట్టలేదన్నారు. చరిత్రను కనుమరుగు చేసే రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీని ప్రజలు విశ్వసించే స్థితిలో లేరన్నారు.

స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన

నిజాం వ్యతిరేక ఉద్యమంలో నాడు ప్రాణాలు కోల్పోయిన వల్లాల గ్రామానికి చెందిన 10 మంది అమర వీరుల స్మారకార్థం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించ తలపెట్టిన స్మారక స్థూపం నిర్మాణానికి మంగళవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హన్మంతరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజును రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకోవడం గర్హనీయమన్నారు. కార్యక్రమాల్లో పీసీసీ నాయకులు నూక కిరణ్‌కుమార్, చామల శ్రీను, తెలంగాణ ఉద్యమకారుడు జైహింద్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు చామల వెంకటరమణారెడ్డి, షేక్ ఇంతియాజ్, అన్నెబోయిన సుధాకర్, మాదగోని రామలింగయ్య, గూని వెంకటయ్య, నోముల జనార్దన్, మురారిశెట్టి కృష్ణమూర్తి, భూపతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహారాష్ట్ర శివసేన ఎమ్మెల్యేపై ఫిర్యాదు


శాలిగౌరారం సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న ఎంపీ చామల, వీహెచ్, ఎమ్మెల్యేలు

శాలిగౌరారం: ఏఐసీసీ నాయకుడు, పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీపై విద్వేషపూరిత ప్రసంగం చేయడంతో పాటూ ఆ ప్రసంగాన్ని పత్రికలు, టీవి చానళ్ళు, సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రచారం చేసిన మహారాష్ట్రకు చెందిన ఎమ్మెల్యే సంజయ్‌గైక్వాడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎంపీ వి.హన్మంతరావు, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశంలతో కలిసి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంజయ్‌గైక్వాడ్ రాహుల్‌గాంధీపై విద్వేషపూరిత ప్రసంగం చేశారని, ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎంపీ వివరించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై మహారాష్ట్ర శివసేన ఎమ్మెల్యే సంజయ్‌గైక్వాడ్‌పై కేసు నమోదు చేసినట్లు శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు.

చెరుకుపల్లిలో దారుణ హత్య

- కుటుంబ కలహాలతో వ్యక్తిని రోకలిబండతో కొట్టి చంపిన భార్య, కుమారుడు

కేతేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య, కొడుకు కలిసి వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన కేతేపల్లి మండలం చెర్కుపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్కుపల్లి గ్రామానికి చెందిన పిట్టల సైదులు(48) తనకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య ప్రమీల, కుమారుడు నవీన్, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు అదే గ్రామానికి చెందిన వ్యక్తితో రెండేళ్ల క్రితం వివాహం జరిపించాడు. వ్యవసాయంలో సరైన దిగుబడులు రాకపోవడంతో పాటు కుటుంబ అవసరాల కోసం సైదులు గ్రామంలో తెలిసిన వారి దగ్గర అప్పులు చేశాడు. దీంతో పాటు సైదులు ఇటీవల మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో సైదులు పేరు మీద ఉన్న మూడెకరాల వ్యవసాయ భూమిని తమ పేరు మీద పట్టా చేయాలని భార్య ప్రమీల, కుమారుడు నవీన్ అతడిపై ఒత్తిడి చేశారు. దీనికి సైదులు అంగీకరించకపోవడంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఈ విషయమై మంగళవారం రాత్రి సైదులు భార్య, కుమారుడితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో భార్య, కుమారుడు కలసి రోకలిబండతో సైదులు తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితులు పరారీలో ఉయ్యారు. సమాచారం తెలుసుకున్న కేతేపల్లి పోలీసులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా .. ఒకరు మృతి


యూసుఫ్ (ఫైల్)

రామన్నపేట: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలం పెరుమాండ్ల బావి గ్రామానికి చెందిన షేక్ యూసుఫ్(52) దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం అదే గ్రామానికి చెందిన జనపాల శ్రీను అనే మోటారు మెకానిక్‌తో కలిసి రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామంలోని ఓ రైతు పొలంలో పాడైపోయిన పంప్‌సెట్‌ను తీయడం కోసం ట్రాక్టర్‌పై బయల్దేరారు. శ్రీను ట్రాక్టర్ నడుపుతుండగా యూసుఫ్ పక్కన కూర్చున్నాడు. ఉత్తటూరు గ్రామ శివారులో రైతు పొలంలో గల బోరు వద్దకు వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై డ్రైవర్ పక్కన కూర్చున్న యూసుఫ్ కిందపడగా, పంప్‌సెట్లను తీయడానికి బిగించిన స్టాండ్ అతడి తలపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ నడుపుతున్న శ్రీను తలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డుపై ఉన్న గుంతను గమనించకుండా ట్రాక్టర్‌ను నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు షకీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని చూపుతున్న పోలీసులు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లా సబ్దాలూర్ గ్రామానికి చెందిన జహీరూల్ ఆరు నెలల క్రితం భువనగిరి పట్టణానికి వలస వచ్చి జంకానగూడలో నివాసముంటున్నాడు. స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు మంగళవారం పట్టణంలో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరపర్చారు. జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి విక్రయించినా, తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. సైదులు తెలిపారు.

వినాయకుడిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న టిప్పర్

- ఐదుగురికి గాయాలు


బోల్తా పడిన ట్రాక్టర్

చౌటుప్పల్ రూరల్: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న ట్రాక్టర్‌ను టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామ స్టేజీ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలోని చౌటుప్పల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడిని నిమజ్జనం కోసం సోమవారం రాత్రి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ చెరువుకు ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో తుప్రాన్‌పేట గ్రామ స్టేజీ వద్దకు చేరుకోగానే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గుంతలు ఉండడంతో ట్రాక్టర్‌లోని వినాయకుడు ఒక పక్కకు ఒరగడంతో ట్రాక్టర్‌ను రోడ్డు పక్కకు నిలిపారు. వినాయకుడికి కట్టిన తాళ్లను బిగిస్తుండగా వెనుక నుంచి టిప్పర్ వచ్చి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌లోని వినాయకుడు, వ్యక్తులు రోడ్డుపై ఎగిరి పడ్డారు. ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మెండె బుచ్చయ్యతో పాటు గోలి యాదగిరి, మహేందర్, ఊదరి క్రాంతి, బద్దం లింగారెడ్డికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవరెడ్డి తెలిపారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- చెరువులో మునిగి యువకుడి మృతి
- జిబ్లక్‌పల్లిలో ఘటన


ప్రవీణ్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న క్రమంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం ఉదయం భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిబ్లక్‌పల్లి గ్రామంలోని ముష్టోంబావి కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి శోభాయాత్రను సోమవారం నిర్వహించారు. ఈ శోభాయాత్రలో పాల్గొనేందుకు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న గ్రామానికి చెందిన పబ్బతిగాని ప్రవీణ్(27) రెండు రోజుల క్రితమే వచ్చాడు. సోమవారం అర్ధరాత్రి వరకు శోభాయాత్ర జరిగింది. అప్పటికే చాలా ఆలస్యం కావడం, గ్రామ శివారులోని ఊర చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేయాలంటే అక్కడ కరెంట్, సరైన సదుపాయాలు లేకపోవడంతో యువకులంతా మంగళవారం ఉదయం నిమజ్జనం చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం ఉదయం 8గంటల సమయంలో వినాయకుడిని ట్రాక్టర్‌లో తీసుకుని నిమజ్జనం చేసేందుకు ఊర చెరువు వద్దకు పబ్బతిగాని ప్రవీణ్‌తో పాటు మైలుగాని ఉదయ్, మైలుగాని సాయిప్రకాశ్, పబ్బతిగాని ప్రశాంత్, మైలుగాని సత్తయ్య, మైలుగాని సాయికిరణ్‌తో పాటు మరో 20మంది యువకులు, పిల్లలు వెళ్లారు. గతంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువులో పూడికతీత తీయించడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షానికి చెరువు నిండి గోతులు కన్పించడం లేదు. ఇది గమనించని ప్రవీణ్‌తో పాటు మరికొందరు యువకులు వినాయకుడిని నిమజ్జనం చేసే క్రమంలో ఆ గుంతల్లోని నీటిలో మునిగారు. ఇది గమనించిన అక్కడే ఉన్న మైలుగాని సత్తయ్య నీటిలో మునిగిపోతున్న బన్నీ, సన్ని, నాని తదితరులను చేతిని పట్టుకొని బయటికి లాక్కొచ్చాడు. ఈ హడావుడిలో నీట మునిగిన ప్రవీణ్‌ను ఆలస్యంగా గమనించి చెరువు లోంచి బయటికి తీసుకొచ్చే క్రమంలో ఈత రాక నీటమునిగి ప్రవీణ్ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రవీణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.


నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రజాపాలన దినోత్సవంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నల్లగొండలో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు


సూర్యాపేటలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్


సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలో అమరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్


భువనగిరి కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ తదితరులు



భువనగిరిలో నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


యాదాద్రి కొండ పైన జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఈఓ భాస్కర్‌రావు